క్లుప్తంగా

ఆవులను రోడ్లపైకి వదిలితే భారీ జరిమానా

నగర పాలక సంస్థ కమిషనర్ శారదాదేవి

మంగళగిరి: ఆవులు, పందులు, కుక్కలను నగరంలో రోడ్లపైకి వదిలితే భారీ జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ యు శారదాదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆవులు, పందులు, కుక్కలను యజమానులు బహిరంగంగా వదులుతుండటంతో రోడ్లపై ప్రమాదాలు జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా జంతువులను రోడ్లపైకి వదిలితే రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఆయా జంతువుల యజమానులు అధికారులకు సహకరించి వాటిని సంరక్షించుకోవాలని కోరారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్, తాడేపల్లి మెయిన్ రోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసి పైపులైను నుంచి తాగునీరు లీక్ కావడంతో మంగళవారం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. తాడేపల్లి ప్రధాన రహదారిలో కొత్తగా వేసిన పైప్‌లైన్ జాయింట్ ఊడిపోవడంతో తాగునీరు భారీగా డ్రెయిన్ కలుస్తోంది. సమాచారం అందుకున్న ఇంజినీరింగ్ సిబ్బంది తాగునీటి సరఫరాను నిలిపివేశారు. డోలాస్‌నగర్‌లో భారీ వాహనాలు వెళ్లడంతో భూమి లోపల ఉన్న పైప్‌లైన్ దెబ్బతిని లీకేజ్ ఏర్పడడంతో అక్కడ కూడా తాగునీటి సరఫరాను నిలిపివేసి 2 గంటల వ్యవధిలో ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు నిర్వహించి తాగునీటిని పునరుద్ధరించారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురైతే సంబంధిత సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బంది కోరారు.

పేకాట స్థావరాలపై దాడి

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడులలో ఆరుగురు వ్యక్తులతోపాటు రూ.10,600 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు.


పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మోతడక చలపతిలో మొక్కలు నాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



మోతడక(తాడికొండ): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తాడికొండ మండలం మోతడక చలపతి కళాశాల ప్రిన్సిపల్ కె కిరణ్‌కుమార్ అన్నారు. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ టెక్నోక్రాట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టి పర్యావరణానికి మేలు జరుగుతుంది కనుక ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా సమాజానికి మేలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవి నాగ శ్రీనివాసరావు, సీఎస్‌ఈ విభాగాధిపతి జి రామచంద్రరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి విశేషపూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రామాలయం వద్ద నున్న అభయాంజనేయస్వామి వారికి శ్రావణమాస పూర్ణిమ మంగళవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు రాజేంద్రశర్మ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర,సహస్రనామాలతో పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

6న మహమ్మద్ రఫీ సంగీత విభావరి

తెనాలి: ప్రముఖ గాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా ఈనెల 6వ తేదీన రఫీ సాబ్ కె గానే సంగీత విభావరిని నిర్వహించనున్నారు. ఇక్కడి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో డాక్టర్ కె.పురుషోత్తమరావు ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి 9 గంటల వరకు జరిగే విభావరిలో ఆయనతోపాటు షేక్ బి.సైదా, పీఎల్ ఆలీఖాన్, షేక్ ఖాజా షానవాజ్, పి.శివలీల, ఎం.మల్లికలు రఫీ గీతాలను గానం చేస్తారు. రఫీ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులు పరిశీలన



పాత టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారి వెంబడి జంక్షన్‌ను అభివృద్ధి చేసేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి అధికారులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి ప్రాంతంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించడంతోపాటు, జాతీయ రహదారి వెంబడి సర్వీస్‌రోడ్‌లో ఆధునీకరణ చేసేందుకు, డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించేందుకు వివిధ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌ను అందంగా తీర్చిదిద్దేందుకు బైపాస్‌రోడ్‌లో పలుచోట్ల జంక్షన్లు ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు జాతీయ రహదారి అధికారులకు రాతపూర్వకంగా అందజేశామని, ఓల్డ్ టోల్‌గేట్ వద్ద ఇరువైపులా వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేయడంతోపాటు పార్క్ నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రాతూరు అండర్‌పాస్ వద్ద స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. సర్వీస్ రోడ్డు వెంబడి వచ్చే వర్షపు నీటితోపాటు మురుగు పోయేందుకు డ్రెయిన్ ఏర్పాటు కోసం ఇప్పటికే ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రణాళిక సిద్ధం చేసి లెవలింగ్ తీశారని, త్వరలోనే జాతీయ రహదారి అధికారుల నుంచి అనుమతి లభించిన వెంటనే డ్రెయిన్‌లు నిర్మిస్తామని తెలిపారు. అనంతరం ఉండవల్లి, కుంచనపల్లి, చిర్రావూరు, ఇప్పటం తదితర ప్రాంతాల్లో దాదాపుగా మూడున్నర కోట్ల వ్యయంతో చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఏఈలు కిషోర్, ప్రవీణ్‌లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

చేనేత కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

మంగళగిరి: నగరంలోని లక్ష్మీ నృసింహస్వామి కాలనీకి చెందిన ఓ వృద్ధ చేనేత కార్మికుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చేయూతనందించారు. చేనేత కార్మికుడు దామర్ల మల్లేశ్వరరావు వృద్ధాప్యంతో బాధపడుతుండగా భార్య సైతం అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయం తెలిసి స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే మంగళవారం వృద్ధ చేనేత కార్మికుని కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయంతోపాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. ఆత్మకూరుకు చెందిన చింతల చెరువు రవి, తాతా మురళీకృష్ణ, పులివర్తి శ్రీనివాసరావులకు ప్లాట్ ఫారం రిక్షాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, బొమ్ము శివరామిరెడ్డి, మల్లవరపు సుధారాణి, సంకె సునీత, బేతపూడి నర్సయ్య, రాంబాబు, ఆంజనేయులు, రామనాథం పూర్ణచంద్రరావు, ఆకురాతి రాజేష్, అంజి, రంగిశెట్టి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన బచ్చలకొరి శ్రీనివాస్ మృతి చెందగా అంత్యక్రియల కోసం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి మంగళవారం దుగ్గిరాల మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, సర్పంచ్ ఉన్నం ఝాన్సీల ద్వారా అందజేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ సుభాని, గ్రామ సచివాలయ కన్వీనర్ కావూరి అశోక్, కొండూరు బుల్లిబాబు, పంచాయతీ బోర్డు సభ్యులు డి.వీర వసంతరావు, బాబు, గుడిపూడి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారికి ఎమ్మెల్యే ఆర్కే చేయూత

దుగ్గిరాల మండలం పెదపాలెంలో చిరు వ్యాపారి దడికి రాంపులికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. ఇస్త్రీబండిని మంగళవారం జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి వీరయ్య, చిలకా తిమోతి, కొంతి సాంబశివరావు, బుల్లా శ్రీను, జక్రయ్య, జార్జ్, కాటయ్య, కొలకలూరి కోటయ్య, గొడవర్తి సింగ్, ప్రసాద్, రామయ్య, శేఖర్, రవి, రాజేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో తాడేపల్లి విద్యార్థులకు పతకాలు



అండర్ 17 బాలుర విభాగంలో పతకాలు సాధించిన విద్యార్థులు



అండర్ 14 విభాగంలో పతకాలు సాధించిన విద్యార్థులు

తాడేపల్లిరూరల్: కర్నూలులో గత నెల 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో తాడేపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని గీతాంజలి స్కూలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి మాట్లాడుతూ కర్నూలు జిల్లా గార్గేయపురంలో గత నెల 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారని అన్నారు. స్పీడ్ ఆఫ్ విభాగం అండర్ 17 బాలుర విభాగంలో పి.పవన్ బంగారు పతకాన్ని, టి.శ్రీవర్ధన్ వెండి పతకాన్ని, కె.మేఘవర్ధన్ కాంస్య పతకాన్ని సాధించారని, అండర్-14 విభాగంలో బాలుర విభాగంలో ఎ.పురంధర్ గోల్డ్‌మెడల్‌ను, విఘ్నేష్ బ్రాంజ్ మెడల్, అండ్-14 బాలికల విభాగంలో ఎం.పూజిత గోల్డ్ మెడల్‌ను, జి.సావిత్రి బ్రాంజ్ మెడల్‌ను, అండర్ ఎ బాలుర విభాగంలో పి.హేమ శివశంకర్ గోల్డ్ మెడల్‌ను, జి.జితేంద్ర సిల్వర్ మెడల్‌ను, బి.ప్రజ్వల్ బ్రాంజ్ మెడల్‌ను, అండర్ 8 బాలికల విభాగంలో అన్విత గోల్డ్ మెడల్‌ను సాధించారని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు షాహిన్, పవన్‌లను, విజేతలను అభినందించారు.

రాష్ట్రంలోనే తలమానికంగా ఎంసీహెచ్ వార్డు



జింఖానా కార్యదర్శి డాక్టర్ పట్టాభిరామన్‌తో కలిసి పనులు పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రభుత్వ సహకారంతో గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింఖానా పేరుతో సుమారు రూ.80 కోట్లతో నిర్మిస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏపీలోనే తలమానికంగా నిలుస్తోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జింఖానా కార్యదర్శి, 1983 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ సామినేని పట్టాభిరామన్ ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఎంసీహెచ్ వార్డు రెండు ఫ్లోర్లు పూర్తి కావచ్చాయని, మరో నాలుగు ఫ్లోర్ల నిర్మాణ పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామన్నారు. డాక్టర్ పట్టాభిరామన్ మాట్లాడుతూ ఎంసీహెచ్ వార్డు నిర్మాణాన్ని వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అనేక మంది పూర్వ విద్యార్థులు ఎంసీహెచ్ నిర్మాణం కోసం విరివిగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారన్నారు. శరవేగంగా నిర్మాణ పనులు సాగడం సంతోషంగా ఉందన్నారు. సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందనాయక్, డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యార్థి అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణ

- పాఠశాలకు వెళ్లి విచారించిన డీఈఓ శైలజ
- బాధ్యులైన హెచ్‌ఎం, పీఈటీ సస్పెన్షన్



జీజీహెచ్ క్యాజువాల్టీలో విద్యార్థి లాల్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న డీఈఓ శైలజ

గుంటూరుఎడ్యుకేషన్: కాలం చెల్లిన ఐరన్ ట్యాబ్లెట్లు మింగి తీవ్ర అనారోగ్యానికి గురైన విద్యార్థి లాల్ అహ్మద్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పరామర్శించారు. అదే సమయంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి విద్యార్థికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి లాల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నారని డీఈఓ శైలజ చెప్పారు.

పాఠశాలకు వెళ్లి విచారణ..

డీఈఓ శైలజ ఆర్.అగ్రహారంలోని కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలకు వెళ్లి విచారణ జరిపారు. ఏఎన్‌ఎంలు ఇచ్చిన ట్యాబ్లెట్లను పరీక్షించకుండా నేరుగా విద్యార్థులకు పంపిణీ చేసిన సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిని ప్రశ్నించారు. విద్యార్థి తండ్రి అబ్దుల్ హనీఫ్‌తో మాట్లాడారు. డీఈఓ వెంట డీవైఈఓ వి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

హెచ్‌ఎం, పీఈటీ సస్పెన్షన్

సంఘటనకు బాధ్యులను చేస్తూ కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డితో పాటు పీఈటీ శిరీషారాణిని సస్పెండ్ చేశారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాతగుంటూరు: లాలాపేటలోని పద్మావతి అండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మంగళవారం గుంటూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి సి.హెచ్.రాజగోపాలరావు సందర్శించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో జిల్లా జడ్జికి స్వాగతం పలికారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జిని సత్కరించి ప్రసాదం అందజేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, అర్చకులు మురళీచంద్రకుమార్, శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరులో 'బ్రో' చిత్రయూనిట్ సందడి



పాతగుంటూరు: సాయిధరమ్ తేజ్ హీరోగా నటించిన బ్రో చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా మంగళవారం గుంటూరులోని ఓ థియేటర్‌ను చిత్ర యూనిట్ సందర్శించారు. థియేటర్‌లోని అభిమానులను పలుకరించారు. ఈసందర్భంగా సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ అందరూ కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమన్నారు. మీ అభిమానంతో మరిన్ని సినిమాల్లో నటిస్తానన్నారు. ఆయన వెంట చిత్ర దర్శకుడు సముద్ర ఖని, చిత్ర యూనిట్ ఉన్నారు.

రేపు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశానికి కౌన్సెలింగ్

తెనాలి: ప్రభుత్వ ఐటీఐ, తెనాలిలో ఆగస్టు-2023 విద్యాసంవత్సరం రెండో విడత ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపల్/ జిల్లా కన్వీనర్ రావి చిన్నవెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ప్రభుత్వ ఐటీఐ, తెనాలిలో మొత్తం 276 సీట్లకు గాను కేవలం 70 సీట్లు మాత్రమే భర్తీ అయినట్టు తెలిపారు. మిగిలిన 206 సీట్లను 300 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తు, వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు అందరికీ సీట్లు వచ్చే అవకాశం ఉన్నందున 3న జరిగే కౌన్సెలింగ్‌కు రావాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మొత్తం 1368 సీట్లకు కేవలం వంద సీట్లు మాత్రమే భర్తీ అయినట్టు చెప్పారు. మిగిలిన 1268 సీట్లకు 1025 దరఖాస్తులు మాత్రమే వచ్చాయనీ, అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న ఐటీఐల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గుంటూరు ఈస్ట్: విద్యుత్ ఉద్యోగుల నిరసనలో భాగంగా మంగళవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు నల్లచెరువులోని డీఈ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. డీఆర్‌ఓ కె.చంద్రశేఖరరావుకు వినతి పత్రం సమర్పించారు. జేఏసీ కార్యదర్శి రాజేష్ ఖన్నా మాట్లాడుతూ సచివాలయాలలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్టు వర్కర్‌లను రెగ్యులర్ చేయాలన్నారు. పే రివిజన్ కమిషన్‌ను అమలు చేయాలని డిమాండు చేశారు. జేఏసీ చైర్మన్ ఆంజనేయులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపాలి

తాడేపల్లిరూరల్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఏపీ జానపద వృత్తి కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు ఆకురాతి జగన్ అన్నారు. మంగళవారం కుంచనపల్లి అంబేడ్కర్ సెంటర్ వద్ద మణిపూర్ ఘటనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడడంతో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. బీజేపీ ప్రోద్బలంతోనే మైతేయ్‌లు మారణహోమం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు పూనుకుంటోందని, దేశ సంపదను ప్రైవేటు పరం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్‌బాబు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కొట్టే కరుణాకరరావు, సీపీఎం మండల నాయకులు పల్లె కృష్ణ, కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రామారావు, నల్లపు బాబూరావు, బిరుదుగడ్డ ఏలియా, మత్తయ్య, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూలు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు సాధించిన షీల్డులు, మెడల్స్‌తో ప్రిన్సిపల్ వాసు

మంగళగిరి: నగరంలోని షరాఫ్ బజారు శ్రీ చైతన్య టెక్నో విద్యార్థులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రతిభావంతులను గుర్తించే క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నాసా నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ స్పైస్ సెటిల్‌మెంట్ -2023 ప్రోగ్రాంలో శ్రీచైతన్య పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు ఆరుష్, రాజు, పార్థశ్రీవల్లి, యాస్మిన్ అక్షయకృష్ణ, భానుశ్రీ సమర్పించిన ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ కుక్కమళ్ల వాసు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు చదువులతోపాటు అన్ని రంగాల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఈ విజయం ఒక్క పాఠశాలదే కాదని, మంగళగిరి ప్రాంతం మొత్తానికి చెందుతుందన్నారు. ప్రాజెక్ట్ విజయానికి కృషి చేసిన అధ్యాపకులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రాజెక్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు షీల్డులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ హబీబ్, కోఆర్డినేటర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 17 నుంచి సెప్టెంబరు 26వ తేదీ వరకు సీపీఐ నిర్వహించతలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం సీపీఐ నియోజకవర్గ సమితి సభ్యుల సమావేశం నిర్వహించారు. జంగాల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన ప్రధాని మోదీ పెట్రోలు, డీజిలు, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలను మోపారని విమర్శించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ మణిపూర్‌లో పెద్దఎత్తున మారణహోమం కొనసాగుతున్నా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పట్టీపట్టనట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ ఘటనకు నైతిక బాధ్యత వహించి తక్షణమే వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి -దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ఈనెల 17వ తేదీ నుంచి సెప్టెంబరు 26వ తేదీ వరకు జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు బత్తూరి మోహనరావు,కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జి సాంబిరెడ్డి, ఎ ప్రభాకర్, బ్రహ్మేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

13న చిత్రలేఖనం పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న తాడేపల్లి బాలోత్సవం నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వివిధ పాఠశాలల్లో తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు బాలోత్సవం నిర్వాహకులు అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని బాలోత్సవం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలల్లో సీనియర్స్ విభాగం 8,9,10 తరగతులు, జూనియర్ విభాగం 6,7 తరగతులు, సబ్ జూనియర్స్ 3,4,5 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జెండా వందనం, స్వాతంత్ర్య సమరయోధులు, దేశమును ప్రేమించుమన్న చరణాలపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయని తెలిపారు. 13వ తేదీ సాయంత్రం రెండు నుంచి నాలుగు గంటల వరకు తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని సీఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపాన గల అమరావతి ఐకాన్ అపార్ట్‌మెంట్ ఫంక్షన్ హాల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు ఈ నెల 10వ తేదీలోపు 9490099559 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. డ్రాయింగ్ షీట్ మాత్రమే ఇవ్వబడుతుందని, మిగిలిన మెటీరియల్ చిత్రకారులే తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. సమాజంలో ఇంగ్లీషు భాష ఆవశ్యకత పెరిగిందని, మాతృభాషతోపాటు ఆంగ్లంపై కూడా పట్టు సాధించడం అవసరమనే ఉద్దేశంతో ఆంగ్లం నేర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు, కళాశాల విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, సింపుల్ ఇంగ్లీష్ తదితర అంశాలపై బీఎస్‌ఎన్‌ఎల్ అసిస్టెంట్ మేనేజర్ పి.రాజు ఆంగ్ల భాషపై శిక్షణ ఇస్తారని వివరించారు. మధ్యాహ్నం 2 గంటల నుండి లక్ష్యసాధన, నాయకత్వ లక్షణాలు, టీమ్ అభివృద్ధి, ప్లానింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ అంశాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా ఈ శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కరపత్రాలను తాడేపల్లి పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8790854540, 9246466114, 9848021115 నెంబర్లను సంప్రదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో బాలోత్సం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు దుర్గి కోదండరామయ్య, బిట్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అపార్ట్‌మెంట్ కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కాకాని రోడ్డులో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, నందివెలుగు రోడ్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్‌మెంట్‌ను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటీ ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరీ, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలని, తుది అనుమతుల కోసం తమకు పంపే ముందే ప్రణాళిక అధికారులు సదరు వెంచర్‌లను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అదేవిధంగా నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డీపీఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని, లేకుంటే తదుపరి అనుమతులను నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ మంజూరు చేయబోమన్నారు. ఈ పర్యటనలో డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసీపీ బాబురావు, టీపీబీఓ రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.